క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈనెల 5న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని టీఎస్ ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ సాంబరెడ్డి తెలిపారు. రాంనగర్, రాజాజీ నగర్, టీబీ హాస్పిటల్, విద్యారణ్యపురి, పలివేల్పుల సీఆర్పీఎఫ్ క్యాంపు, కేయూ పోలీసు స్టేషన్, గుండ్ల సింగారం, కేయూసీ ఇంజనీరింగ్ కళాశాల, ఎల్వీఆర్ నగర్, సుందరయ్య నగర్, అడ్వకేట్స్ కాలనీ, భీష్మనగర్, హయగ్రీవాచారి మైదానం ప్రాంతాల్లో ఉదయం 8నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

పద్మకు డాక్టరేట్



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని తెలుగు విభాగం పరిశోధకురాలు జక్కె పద్మకు యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. తిక్కన మహాభారతం – మౌసల నుంచి స్వర్గరోహణ ప్రావములు, విమర్శనాత్మక పరిశీలన అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి పద్మకు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ మల్లారెడ్డి తెలిపారు. ఆ విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్ యాదగిరి పర్యవేక్షణలో పద్మ తన పీహెచ్డీ పూర్తిచేశారు.

మడికొండ గ్రంథాలయాన్ని పునరుద్ధరించాలి

హన్మకొండ: రెండేళ్లుగా మూతపడి ఉన్న మడికొండ గ్రంథాలయాన్ని పునరుద్ధరించాలని పౌర స్పందన వేదిక అధ్యక్షుడు శంకర్రావు, కార్యదర్శి నల్లెల రాజయ్య సూచించారు. గ్రంథాలయం శిథిలావస్థకు చేరినా, నిర్వహణ అధ్వానంగా మారినా జిల్లా ప్రభుత్వ యంత్రాంగం పట్టించుకోకపోవడం విచారకరమని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మడికొండ, గీసుకొండ, వరంగల్ మహానగరంలోని రామన్నపేట గ్రంథాలయాలు నిర్వహణ కొరవడి మూసిఉన్నట్లు తెలిపారు. కలెక్టర్, జిల్లా గ్రంథాలయ సంస్థ అధికారులు మేల్కొని మూసివేసిన గ్రంథాలయాలను తెరిపించాలని కోరారు.

శుభ్రమైన ఆహారమే తీసుకోవాలి



ఖిలా వరంగల్: రోగాల బారిన పడకుండా ప్రజలు నిత్యం శుభ్రమైన ఆహారం తినడం అలవాటు చేసుకోవాలని ఆడెపు ఓవర్సీస్ కన్సల్టెన్సీ సీఈఓ ఆడెపు మధుసూదన్, బీజేపీ సోషల్ మీడియా కన్వీనర్ ఆడెపు వెంకటేష్ సూచించారు. ప్రపంచ క్యాన్సర్ నిర్మూలన దినోత్సవం సందర్భంగా ఖిలా వరంగల్ వాకింగ్, క్రీడా మైదానం నుంచి ఖుష్మహల్ వరకు ఓవర్సీస్ కన్సల్టెన్సీ ఆధ్వర్యంలో క్యాన్సర్ నిర్మూలనపై ఆదివారం 2కే రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వయస్సుతో సంబంధం లేకుండా ప్రతిఒక్కరూ వ్యాయామం చేయాలని, పరుగెత్తడం, సుచి శుభ్రతతో కూడిన ఆహారం తినాలని, ప్లాస్టిక్ వినియోగం తగ్గించాలని చెప్పారు. 2కే రన్లో విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు.

ఓసిటీలో లలిత మహాత్రిపుర సుందరి మహాయాగం



కాశిబుగ్గ: బాలమానస మహావిద్యాపీఠం, లక్ష్మీనారాయణ గురుభవాని ఆధ్వర్యంలో ఓసిటీలో రుద్రసహిత లలిత మహాత్రిపుర సుందరి మహాయాగాన్ని ఆదివారం నిర్వహించారు. యాగంలో మానస పరివార్ ట్రస్ట్ సభ్యులు తత్తరి లక్ష్మణ్, గోరంటల రాజు, 20వ డివిజన్ కార్పొరేటర్ గుండేటి నరేంద్రకుమార్, నెల్లుట్ల ఎల్లయ్య, రవి, అరుణ్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి చేయూత



హసన్పర్తి: అనారోగ్య సమస్యలతో ఇటీవల మరణించిన మల్లారెడిపల్లికి చెందిన వక్కల భద్రయ్య కుటుంబాన్ని మాజీ ఉపసర్పంచ్ యుగంధర్ ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి 50కిలోల బియ్యాన్ని అందించారు.

బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శిగా రాజేంద్రప్రసాద్



రామన్నపేట: బీసీ సంక్షేమ సంఘం గ్రేటర్ వరంగల్ ప్రధాన కార్యదర్శిగా వరంగల్ రామన్నపేటకు చెందిన ఆడెపు రాజేంద్రప్రసాద్ను నియమిస్తూ అధ్యక్షుడు అప్పరాజు రాజు ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఐదు దశాబ్దాలుగా అట్టడుగు వర్గాల వారికి రాజేంద్రప్రసాద్ ఎనలేని సేవలు అందిస్తున్నారని రాజు పేర్కొన్నారు.

ఏడాదిగా పైపులైన్లకు లీకేజీలు

- రహదారిపై గుంతలు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు, వాహనదారులు
- పట్టించుకోని అధికారులు



కాజీపేట చౌరస్తా సమీపంలో లీకవుతున్న తాగునీటి పైపులైన్లు



సోమిడి రోడ్డులో ప్రవహిస్తున్న నీరు

కాజీపేట: ఒకటి, రెండు రోజులు కాదు ఏడాది కాలం నుంచి కాజీపేట చౌరస్తా ప్రధాన రహదారిపై నుంచి సోమిడి రోడ్డు వరకు ఉన్న ప్రధాన రహదారిపై తాగునీటి పైపులైన్లు పగిలి తాగునీరు వృథాగా పోతోంది. భూగర్భంలో వేసిన పైపులైన్లకు రంధ్రాలు పడటంతో తాగునీరు బయటకు ఉబికివస్తూ రహదారిపై ప్రవహిస్తోంది. పైపులైన్ల నుంచి లీకవుతున్న నీరు రహదారి పొడవునా ప్రవాహిస్తూ మోరీల్లో కలుస్తోంది. దీంతో రహదాలరిపై గుంతలు ఏర్పడి వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు.

నీటి వృథా అవుతోందని తెలిసినా..

ఒకవైపు రోడ్డుపై ప్రవహిస్తున్న నీటితో వాహనదారులు, బాటసారులు ఇక్కట్లు ఎదుర్కొంటుండగా, మరోవైపు ఎగువ ప్రాంతాలకు తాగునీరు సరిగా సరఫరాకాక ప్రజలు వాటర్ ప్లాంట్లపై ఆధారపడుతున్నారు. ఏడాది నుంచి ఇదే దుస్థితి కొనసాగుతున్నా మున్సిపల్ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదు. ప్రధాన పైపులైన్లకు లీకేజీలు పడి సరఫరా అయ్యే నీటిలో ఎక్కువ శాతం ఇక్కడే వృథా అవుతోందని తెలిసినా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు. ఎగువ ప్రాంత కాలనీలకు తాగునీరు సక్రమంగా అందడంలేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు, పాలకులు స్పందించి లీకేజీను సరిచేసి తాగునీరు సక్రమంగా సరిపడా సరఫరా అయ్యేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

మరమ్మతులు చేయాలి



రహదారుల వెంట ఉన్న పైపులైన్ల లీకేజీలను వెంటనే సరిచేయాలి. ఈ విషయమై అధికారులకు తరచూ ఇస్తున్న వినతిపత్రాలు బుట్టదాఖలు అవుతున్నాయే తప్ప పనులు మాత్రం కావడం లేదు. కార్పొరేటర్ల మాటలను సైతం అధికారులు పెడచెవిన పెట్టడం బాధాకరం. అధికారులు, పాలకులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలి.

– వెనిశెట్టి రఘు, కాజీపేట

పశ్చిమ నియోజకవర్గ అభివృద్ధికి కృషి



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి

హన్మకొండ: నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందేలా కృషి చేస్తున్నానని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. హనుమకొండ 57వ డివిజన్లోని కృష్ణాకాలనీలో రూ.50 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు, డ్రెయినేజీ నిర్మాణానికి కార్పొరేటర్ నల్ల స్వరూపరాణితో కలిసి ఎమ్మెల్యే ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధే తన ఏకైక లక్ష్యమని చెప్పారు. కార్యక్రమంలో ఏఈ శ్రీకాంత్, వర్క్ ఇన్స్పెక్టర్ రవికుమార్, మాజీ కార్పొరేటర్ ఎనుకంటి నాగరాజు, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు బంక సరళ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బంక సంపత్ యాదవ్, డివిజన్ అధ్యక్షులు బంక సతీశ్ యాదవ్, శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

కేఎల్ఎన్రెడ్డి కాలనీ అభివృద్ధికి కృషి

కేఎల్ఎన్రెడ్డి కాలనీ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. హనుమకొండలోని కేఎల్ఎన్రెడ్డి కాలనీలో కాలనీ అభివృద్ధి కమిటీ సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ విద్యాగౌతమ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు వీరారెడ్డి, సత్యనారాయణ, మాధవ రెడ్డి, రవీందర్ రెడ్డి, రాజిరెడ్డి, సీహెచ్ మధుసూదన్, కాంగ్రెస్ 51వ డివిజన్ అధ్యక్షుడు కొండా నాగరాజు, నాయకులు నాయిని లక్ష్మారెడ్డి, రాజ్గోపాల్, కుందూరు జయశ్రీ, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

శాశ్వత నిర్మాణాలు చేపడతా..



నాలాను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నాగరాజు, నాయకులు

హసన్పర్తి: 56వ డివిజన్ను ఆదర్శంగా తీర్చిదిద్దుతానని వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు అన్నారు. డివిజన్లోని సప్తగిరి కాలనీ, పరిమల కాలనీ, జవహర్కాలనీ, ఆర్టీసీ కాలనీల్లో ఆదివారం ఆయన సుడిగాలి పర్యటన చేశారు. ఈ సందర్భంగా పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి స్థానికులు తీసుకెళ్లారు. అనంతరం, ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ సర్కారు పట్టించుకోకపోవడంతోనే డివిజన్లో సమస్యలు నెలకొన్నాయని విమర్శించారు. అంతర్గత రోడ్లు, మురుగునీటి కాల్వల నిర్మాణాలను శాశ్వత ప్రతిపాదికన నిర్మిస్తానని చెప్పారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ సిరంగి సునీల్కుమార్, కాంగ్రెస్ నాయకులు బీరం రవీందర్రెడ్డి, కొంక హరిబాబు, కందుకూరి పూర్ణచందర్, సారంగపాణి, జనార్దన్, స్థానికులు ప్రభాకర్రెడ్డి, అనిత, గొడిశాల సంధ్య తదితరులు పాల్గొన్నారు. కోమటిపల్లిలో నిర్వహిస్తున్న ప్రవీణ్రాజ్ మెమోరియల్ క్రికెట్ పోటీలను ఎమ్మెల్యే నాగరాజు ప్రారంభించారు.

ఓపెన్ స్కూల్తో ఎంతో మేలు



స్టడీ మెటీరియల్ అందజేస్తున్న శంకర్రావు

కాశిబుగ్గ: చదువు మధ్యలో మానేసిన వారికి ఓపెన్ స్కూల్ చదువు ఎంతో మేలు చేస్తుందని ఓపెన్ స్కూల్ ఉమ్మడి వరంగల్ జిల్లా కోఆర్డినేటర్ మురాల శంకర్రావు అన్నారు. కాశిబుగ్గ నరేంద్రనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని ఓపెన్ స్కూల్ సెంటర్ను ఆయన ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల అడ్మిషన్ల రిజిస్టర్, హాజరు పట్టికను పరిశీలించారు. అనంతరం, శంకర్రావు మాట్లాడుతూ పరీక్ష ఫీజు కట్టే తేదీలను త్వరలో ప్రకటిస్తామని, ప్రతి విద్యార్థి మూడు అసైన్మెంట్లు రాయాలని, ముప్పై తరగతులకు తప్పకుండా హాజరు కావాలని సూచించారు. ఇంటర్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేశారు. కార్యక్రమంలో ట్యూటర్ డాక్టర్ రవీందర్, కుమారస్వామి, దినేష్, సెంటర్ అసిస్టెంట్ కోఆర్డినేటర్ అజయ్బాబు తదితరులు ఉన్నారు.

కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలి



కేయూ క్యాంపస్: రాష్ట్రంలోని 12 యూనివర్సిటీల్లో పనిచేస్తున్న 1,445 మంది కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులరైజ్ చేసేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని తెలంగాణ ఆల్ యూనివర్సిటీ కాంట్రాక్టు టీచర్స్ జేఏసీ చైర్మన్, కాకతీయ యూనివర్సిటీ కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ శ్రీధర్కుమార్ లోథ్ కోరారు. ఈమేరకు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డిని హనుమకొండలో ఆదివారం కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం బాధ్యులు ఆర్డీ.ప్రసాద్, చందులాల్, మధుకర్, ప్రభాకర్ తదితరులున్నారు.

కార్మికులను క్రమబద్ధీకరించాలని వినతి



వరంగల్ అర్బన్: ఏళ్ల తరబడి ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ కార్మికులను ప్రభుత్వం రెగ్యులరైజ్ చేయాలని సంఘం నాయకులు కోరారు. ఈమేరకు వరంగల్ 26వ డివిజన్లో మంత్రి కొండా సురేఖకు ఆదివారం వినతిపత్రం అందజేశారు. పనికి తగిన వేతనాన్ని అందించాలని సూచించారు. కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి మీసాల ప్రకాశ్, కొత్తకొండ శ్రీనివాస్, కొమ్ము తిలక్, కుమార్, ప్రసాద్, నరేష్, దేవేందర్ తదితరులు ఉన్నారు.

15న సెలవుదినంగా ప్రకటించాలి



ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందిస్తున్న సేవాలాల్ ఉత్సవ కమిటీ, ఎల్హెచ్పీఎస్ నాయకులు

హన్మకొండ: సేవాలాల్ జయంతిని అధికారికంగా నిర్వహించడంతో పాటు ఆ రోజును ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించాలని సంత్ శ్రీసేవాలాల్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు బానోత్ నవీన్ నాయక్ కోరారు. హనుమకొండ బాలసముద్రంలోని క్యాంపు కార్యాలయంలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డిని సంత్ శ్రీసేవాలాల్ ఉత్సవ కమిటీ, లంబాడ హక్కుల పోరాట సమితి నాయకులు ఆదివారం కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సేవాలాల్ జయంతిని అధికారికంగా నిర్వహించేలా సీఎం ఎనుముల రేవంత్ రెడ్డికి దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. ఈనెల 15న హనుమకొండ గిరిజన భవన్లో జరగనున్న సేవాలాల్ జయంతి కార్యక్రమానికి రావాలని ఎమ్మెల్యేను ఆహ్వానించారు. కార్యక్రమంలో లంబాడ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు పోరిక ఈశ్వర్సింగ్ నాయక్, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం డీన్ ప్రొఫెసర్ భుక్యా బాబురావు నాయక్, టీడీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఉదయ్ సింగ్ నాయక్ పాల్గొన్నారు.

విద్యార్థినుల ఆత్మహత్య బాధాకరం



మాట్లాడుతున్న సునీతారావు

హన్మకొండ చౌరస్తా: యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి గురుకుల పాఠశాలలో పదవ తరగతి విద్యార్థినులు ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమని తెలంగాణ మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు సునీతారావు అన్నారు. హనుమకొండలోని డీసీసీ భవన్లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ గురుకుల విద్యార్థినులు వైష్ణవి, భవ్య మృత్యువార్త దిగ్భ్రాంతికి గురిచేసిందని వాపోయారు. విద్యార్థినులు క్షణికావేశంలో తల్లిదండ్రులకు గర్భశోకం మిగల్చొద్దని సూచించారు. సమస్యలు తలెత్తితే తమ తల్లిదండ్రులకు చెప్పాలని, ఎలాంటి ఒత్తిళ్లకు లోనై ఆత్మస్థైర్యం కోల్పోవద్దని సూచించారు. విద్యార్థినుల కుటుంబాలకు ప్రభుత్వ పక్షాన పూర్తి సహాయ సహకారాలు అందేలా చూస్తామని భరోసా ఇచ్చారు. సమావేశంలో వరంగల్ డీసీసీ అధ్యక్షురాలు స్వర్ణ, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు బంక సరళ, పార్వతమ్మ, ఇందిర, శ్రీదేవి, స్వప్న, సుగుణ, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

8న హైదరాబాద్లో కార్మికుల నిరసన ర్యాలీ



నినాదాలు చేస్తున్న నాయకులు

ఖిలా వరంగల్: కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం ఐఎఫ్టీయూ ఆధ్వర్యంలో ఈనెల 8న హైదరాబాద్లో నిర్వహించనున్న కార్మికుల నిరసన ర్యాలీని విజయవంతం చేయాలని ఐఎఫ్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఆరెల్లి కృష్ణ పిలుపునిచ్చారు. ఖిలా వరంగల్ మధ్యకోటలో మాస (మజ్దూర్ అధికార్ సంఘర్ష్ అభియాన్), ఐఎఫ్టీయూ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ వాల్పోస్టర్లను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వదేశీ, విదేశీ పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసం కార్మిక చట్టాలను సవరించారని విమర్శించారు. కార్యక్రమంలో ఏఐఏఎంఎస్ నేతలు రాచర్ల బాలరాజు, నారాయణ, ప్రభాకర్, రాజు, ఏలియా, సౌందర్య, కోమలత, అఫ్జల్, స్వరూప పాల్గొన్నారు.

ఘనంగా 'తేజోత్సవ్'



విద్యారణ్యపురి: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ అజీజ్ఖాన్ అన్నారు. నగరంలోని ములుగు క్రాస్రోడ్డు సమీపంలోని కేఎస్ఆర్ గార్డెన్లో రామప్ప జూనియర్ కళాశాలలో జూనియర్, సీనియర్ విద్యార్థులకు తేజోత్సవ్ పేరుతో ఫెయిర్వెల్డే వేడుకలను ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో అథ్లెటిక్స్ అసోసియేషన్ స్టేట్ సెక్రటరీ సారంగపాణి, రామప్ప అకాడమీ చైర్మన్ చంద్రమోహన్ గౌడ్, కళాశాల బాధ్యులు ఐలి నాగేశ్వర్రావు, లక్ష్మీనారాయణ, డైరెక్టర్లు కరుణాకర్, తేజస్వి, ఫిజికల్ డైరెక్టర్ కమల్, కోఆర్డినేటర్ వినోద్, వైస్ ప్రిన్సిపాల్ తిరుపతి, అధ్యాపకులు మహేష్, అశోక్, విజయ్, మధుబాబు, చలపతి, చిరంజీవి, రాజు, పూర్ణచందర్, అన్నారెడ్డి పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

పరకాల: కాజీపేటలో జరిగిన రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో పరకాలకు చెందిన క్రియేటివ్ కరాటే డూకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. స్పారింగ్ కేటగిరిలో కె.సాయితేజ, కె.వర్షిత, ఎస్.మాన్యశ్రీ బంగారు పతకాలు సాధించారు. కటాస్లో బాలుర విభాగంలో ఎస్.షన్ముఖ వాచాస్పతి బంగారు పతకం సాధించగా జూనియర్ బాలుర స్పారింగ్లో సాయితేజ గ్రాండ్ చాంపియన్షిప్ సాధించారు. విజేతలను గ్రాండ్మాస్టర్ మాడ సంపత్, మాస్టర్ బొట్ల స్వామి, గడ్డం రాజు అభినందించారు.

టీపీటీఎఫ్ మహాసభలను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న తిరుపతి

విద్యారణ్యపురి: ఖమ్మంలో ఈనెల 11, 12వ తేదీల్లో జరగనున్న తెలంగాణ ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్) రాష్ట్ర మహాసభలు విజయవంతం చేయాలని టీపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నన్నబోయిన తిరుపతి పిలుపునిచ్చారు. హనుమకొండలోని టీపీటీఎఫ్ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. అంతరాలు లేని విద్య ప్రజల హక్కు – ప్రభుత్వ బాధ్యత ప్రధానాంశంగా కామన్ స్కూల్ విద్యా విధానాన్ని అమలు చేయాలనే డిమాండ్తో ఈ సభలను నిర్వహించబోతున్నట్లు వివరించారు. నూతన జాతీయ విద్యావిధానం, రాజ్యాంగ విలువలు, ఫాసిజం – బుద్ధిజీవుల పాత్ర, ఆర్థిక సంక్షోభం –అంతర్జాతీయ పరిస్థితులు – ఫలితాలు ప్రభావం అనే అంశాలపై ఓయూ ప్రొఫెసర్ చింతకింది కాశీం, చంద్రన చక్రవర్తి, బుర్ర రమేష్, వేణుగోపాల్, నర్సింహారెడ్డి, ప్రసాద్ వక్తలుగా ప్రసంగిస్తారని తెలిపారు. సమావేశంలో టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రావుల రమేష్, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు రఘుపతి, జిల్లా ప్రధాన కార్యదర్శి గొడిశాల సత్యనారాయణ, జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు బానోతు సేవానాయక్, ప్రధాన కార్యదర్శి గువ్వాడి జగపతిరావు, జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రగిరి లక్ష్మయ్య, హనుమకొండ జిల్లా పూర్వ ప్రధాన కార్యదర్శి భీమళ్ల సారయ్య, బాధ్యులు భాస్కర్, ఎండీ.సత్తార్ పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి



వేడుకలను ప్రారంభిస్తున్న వినయ్భాస్కర్

కాజీపేట: విద్యార్థులు పుస్తకాలకే పరిమితం కాకుండా తరుచూ క్రీడల్లోనూ పాల్గొనాలని, దాంతో మానసిక ఒత్తిడికి దూరం అవుతుందని బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు, ప్రభుత్వ మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్భాస్కర్ అన్నారు. కాజీపేట మండలం సోమిడి శివారులోని తాళ్ల పద్మావతి ఇంజనీరింగ్ కళాశాల ఆవరణలో జిల్లా ప్రైవేట్ పాఠశాలల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి జరిగిన క్రీడోత్సవాల ముగింపు వేడుకల్లో విజేతలకు బహుమతులు, ప్రశంసపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. క్రీడల నిర్వహణకు సహకరించిన తాళ్ల పద్మావతి విద్యాసంస్థల చైర్మన్ తాళ్ల మల్లేశం, డైరెక్టర్లు వంశీ, చైతన్యను హడుప్పా సంఘం నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సోదా కిరణ్, సంఘం జిల్లా అధ్యక్షుడు వర్ధమాన్ జనార్దన్, రమణరెడ్డి, శంకర్, వేణుమాధవ్, వెంకట్రెడ్డి, సతీష్, రామారావు, సంతోష్రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ గౌరవ పురస్కారం ప్రదానం



మహానంది అవార్డు అందుకుంటున్న సురేష్

కాజీపేట అర్బన్: హనుమకొండలో యువ చైతన్య వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన జాతీయ పురస్కారాల మహోత్సవంలో తెలుగు వెలుగు మహానంది జాతీయ గౌరవ పురస్కారాన్ని 31వ డివిజన్ న్యూశాయంపేటకు చెందిన పెరుగు సురేష్కు అందజేశారు. కరోనా నేపథ్యంలో పెరుగు సురేష్ చేసిన సామాజిక సేవలకు పురస్కారాన్ని అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీత పెరుగు సురేష్ మాట్లాడుతూ తనకు ఈ పురస్కారం రావడంతో మరింత బాధ్యత పెరిగిందని అన్నారు. ఈమేరకు ఆయనకు పలువురు అభినందనలు తెలిపారు.

మత్స్య సంఘాల బలోపేతానికి కృషి



మాట్లాడుతున్న బండా ప్రకాశ్

కాజీపేట అర్బన్: మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల బలోపేతానికి తెలంగాణ ముదిరాజ్ మహాసభ జిల్లా కమిటీలు సమష్టిగా కృషి చేయాలని తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు, శాసన మండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాశ్ ముదిరాజ్ తెలిపారు. 31వ డివిజన్లోని క్యాంపు కార్యాలయంలో ఉమ్మడి వరంగల్ జిల్లా చీఫ్ ప్రమోటర్లు, తెలంగాణ ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షులు, ముఖ్య నాయకులతో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల్లో నూతన సభ్యత్వాలపై శ్రద్ధ చూపాలని, చీఫ్ ప్రమోటర్లను జిల్లా అధ్యక్షుల స్థాయికి తీర్చిదిద్దేందుకు ఐక్యంగా ముందుకు సాగాలని అన్నారు. ప్రభుత్వ హామీల అమలుకు త్వరలో రాష్ట్ర కమిటీ సమావేశం ఏర్పాటు చేసి ప్రత్యేక కార్యాచరణ రూపొందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల చీఫ్ ప్రమోటర్లు, ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

భావసార్ క్షత్రియ సమాజ్ ఉమ్మడి జిల్లా కార్యవర్గం



ప్రమాణ స్వీకారం చేస్తున్న బాధ్యులు

వరంగల్ చౌరస్తా: వరంగల్ పిన్నావారి వీధిలో ఉమ్మడి వరంగల్ జిల్లా భావసార్ క్షత్రియ సమాజ్ కమిటీ సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా క్షీరసాగర్ వేణుగోపాల్, ఉపాధ్యక్షులుగా రాజేష్, అమరనాథ్, ప్రధాన కార్యదర్శిగా ముదులకర్ అనిల్, కోశాధికారిగా మహేంద్రకర్ భాస్కర్, ఆర్గనైజర్గా రమేష్, జాయింట్ సెక్రటరీ గోజేకృష్ణను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారిని సన్మానించారు. సమావేశంలో ప్రొఫెసర్ గర్జే రాజేష్ కుమార్, డాక్టర్ దేశగర్, సత్యనారాయణ, ఆనంద్ బోక్రె తదితరులు పాల్గొన్నారు.

బొడ్రాయి ప్రతిష్ఠాపన వాల్పోస్టర్ల ఆవిష్కరణ



ఖిలా వరంగల్: లక్ష్మీనగర్లో భూలక్ష్మి, శ్రీలక్ష్మి, నాభిశిల (బొడ్రాయి) ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 11న బొడ్రాయి ప్రతిష్ఠాపనకు భూమిపూజ జరగనుందని నిర్వాహకులు తెలిపారు. హనుమకొండ రాంనగర్లోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో వాల్పోస్టర్లను మంత్రి కొండా సురేఖ ఆదివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో దద్దనాల రమేష్, నెల్ల రాజు, మహారాజ్ భరత్, పూజారి హరికృష్ణ, చింతపట్ల మురళి, టేకుమట్ల కుమారస్వామి, పార్వతి రాజు, బత్తిని లింగయ్య, బొల్లం నాగరాజు, బాల శివమూర్తి, గాదె నర్సింగం, బాసాని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
వరంగల్ అర్బన్:
9951602875 9553955722
9010299096
Office mail : wglsakshiadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గంటల నుండి రాత్రి 8.00 గంటల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
ఎల్. రాజేష్ వర్మ (SR) : 9885438059 (హన్మకొండ)
కె. సుధాకర్ (ACO) : 9177258410 (హన్మకొండ)
పి. చంద్రశేఖర్ (ACO) : 8074606274 (వరంగల్)
జి. రవియాదవ్ (ACO) : 9032782191 (కాజీపేట)